

ఒకటో తేదీన 'మహా' కౌన్సిల్

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం వచ్చేనెల ఒకటో తేదీన జరగనుంది. 15 సాధారణ, 89 అనుబంధ అంశాలపై చర్చిస్తారు. 8లో



గ్రామీణులకు ఆధునిక వైద్యసేవలు

సామాజిక ఆస్పత్రులు గ్రామీణుల పాలిట కల్పతరువులా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక వైద్యసేవలు అందిస్తోంది. 8లో

నేడు జగనన్న చేదోడు చెక్కుల పంపిణీ



అనకాపల్లి టౌన్: గుండాల సచివాలయంలో జగనన్న చేదోడు పథకం చెక్కులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం పంపిణీ చేస్తారని డీఆర్వో వెంకటరమణ ఆదివారం తెలిపారు. వర్చువల్ విధానంలో సీఎం లబ్ధిదారుల ఖాతాలకు నగదు విడుదల చేస్తారని చెప్పారు.

న్యూస్‌రీల్

ది రూల్ ... తగ్గేదేలే..!



లొకేషన్‌లో అల్లు అర్జున్

కొమ్మాది: సుకుమార్ దర్శకత్వంలో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న పుష్ప–2 (ది రూల్) సినిమా విశాఖ పోర్టు తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ఆదివారం అల్లు అర్జున్‌పై పలు ఫైటింగ్ సన్నివేశాలను చిత్రీకరించారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ విశాఖలో వచ్చేనెల 7వ తేదీ వరకు జరుగుతుంది.

కత్తి సాములో బాలికల సత్తా

- రాష్ట్ర స్థాయి పోటీలో బహుమతులు



కత్తిసాము పోటీలో పతకాలు సాధించిన వాణిమాధురి, సాయి

కశింకోట: కశింకోట డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీలో తమ ప్రతిభ చూపి పతకాలు సాధించారు. కర్నూలు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న స్థానిక డీపీఎన్ హైస్కూలు విద్యార్థులు వాణి మాధురి కాంస్య పతకం, అణుకు సాయి రజత పతకాన్ని 14 ఏళ్ల లోపు విభాగంలో కైవసం చేసుకున్నారు. వీరిని హైస్కూలు హెచ్‌ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి, పీడీ వి.ప్రభాకరరావు, స్కౌట్ ఉపాధ్యాయుడు జి.గణేష్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బి.దీప, ఉపాధ్యాయులు ఎ.నాగేశ్వరరావు, ఆచంట రవి, దేవానంద్, ఎం.వి.సుధారాణి, కె.అప్పారావు, పి.ఎం.అప్పారావు, రామారావు తదితరులు అభినందించారు.

'స్థానిక' పదవులకు వచ్చేనెల 3న ఎన్నికలు

అనకాపల్లిటౌన్: జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యుడు పదవులకు వచ్చేనెల 3న ఎన్నికలు నిర్వహించనున్నారని, ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా పరిషత్ సీఈవో పి.శ్రీరామ్మూర్తి చెప్పారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్.రాయవరం మండలంలో ఎంపీపీ, పాయకరావుపేట మండలంలో వైస్ ఎంపీపీ, కోటవురట్ల మండలంలో కోఆప్షన్‌సభ్యుడి స్థానాలు వివిధ కారణాల వల్ల ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఎస్.రాయవరం ఎంపీపీ, పాయకరావుపేట వైస్ ఎంపీపీ స్థానాల భర్తీకి ఈనెల 30న సభ్యులకు సమాచారం అందిస్తామని చెప్పారు. వచ్చేనెల 3వతేదీ ఉదయం 11 గంటలకు ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశాల్లో సభ్యులు చేతులెత్తి ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఎన్నుకుంటారని తెలిపారు. కోటవురట్ల కో ఆప్షన్ సభ్యుడి ఎన్నికకు సంబంధించి వచ్చేనెల మూడో తేదీ ఉదయం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అనంతరం ఎన్నికల నిర్వహిస్తామని తెలిపారు. అనివార్య కారణాల వల్ల 3వతేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించలేని పక్షంలో 4వతేదీన సమావేశం నిర్వహిస్తామన్నారు.

రేవు పోలవరం తీరంలో బాలుడు గల్లంతు




రేవంత్ (ఫైల్)

ఎస్‌రాయవరం: రేవు పోలవరం సముద్రతీరంలో ఆదివారం బాలుడు గల్లంతయ్యాడు. స్నేహితులతో వెళ్లిన ఇతని ఆచూకీ తెలియకపోవడంతో తీరంలో గల్లంతయినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. నర్సీపట్నం అయ్యన్న కాలనీకి చెందిన రేవంత్ (15) స్నేహితులతో కలసి ఆదివారం రేవుపోలవరం బీచ్‌కు వచ్చాడు. సముద్రస్నానాలు చేసిన తర్వాత స్నేహితులంతా నర్సీపట్నం వెళ్లిపోయారు. బీచ్‌కు వెళ్లిన రేవంత్ ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు స్నేహితులను ఆరా తీశారు. తమతో బీచ్‌కు వచ్చాడని, తర్వాత కనిపించడం లేదని వారు చెప్పడంతో.. తమ కుమారుడు పోలవరం సముద్రతీరానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని ఎస్.రాయవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తీరంలో గాలింపునకు చర్యలు తీసుకున్నట్టు ఎస్ఐ ప్రసాదరావు చెప్పారు.

ఆపద్బాంధవులు

ఆటుపోట్లను నియంత్రించే ఆ రెండు రాళ్లు



జాలారిపేట మెట్ట



సముద్ర తీరానికి కూతవేటు దూరంలో ఏనుగురాయి, కాపరాయి



మత్స్య సంపదను తీసుకువెళ్తున్న గంగపుత్రులు

సముద్ర కెరటాలు ఎంత ఆహ్లాదపరుస్తాయో.. అంత ప్రమాదకారకాలు కూడా. ఆనందంతో మైమరచి ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా నీటిలోకి లాక్కుపోతాయి. తీరని విషాదాన్ని మిగులుస్తాయి. అయితే పూడిమడక తీరం మాత్రం ఎంతో సురక్షితం. ఇంతవరకు ఎలాంటి ప్రమాదాలు జరగకపోవడానికి ఏనుగు రాయి, కాపరాయిలే కారణం. సాగరతీరానికి సమీపంలో ఉన్న ఈ చిన్నపాటి కొండలు ఆటుపోట్లను నియంత్రిస్తున్నాయి.

- సందర్శకులు, మత్స్యకారుల పాలిట వరం
- అందుకే పూడిమడక తీరం సురక్షితం

అచ్యుతాపురం (అనకాపల్లి): బతుకు తెరువు కోసం సముద్రంపై ఆధారపడే మత్స్యకారులకు ఒక్కోసారి ఆ సాగరమే శాపంగా మారుతుంది. అక్కడి సుందర దృశ్యాలను ఆస్వాదించడానికి వచ్చే సందర్శకులు సైతం అడపాదడపా కెరటాల్లో చిక్కుకోవడం చూస్తుంటాం. సాధారణంగా ప్రతి సముద్ర తీరంలో ఈ రకమైన పరిస్థితి ఉంటుంది. తంతడి, ముత్యాలమ్మపాలెం బీచ్‌లలో స్నానమాచరించే వారు గల్లంతవుతున్న సంగతి తెలిసిందే. కొద్ది నెలల క్రితం పూడిమడక మొగ వద్ద సైతం కొందరు కళాశాల యువకులు నీటిపాలైన ఉదంతం మరిచిపోలేం. అయితే పూడిమడక గ్రామానికి ఆనుకొని ఉన్న తీరం అత్యంత సురక్షితం. సమతలంగా ఉండే ఈ తీరానికి ఆటుపోట్ల తీవ్రత తగ్గేందుకు గల కారణం చిన్నపాటి రెండు కొండలు. సముద్ర గర్భంలో ఉన్నందున పైకి కనిపించే రాళ్లని పిలుస్తుంటారు. ఏనుగురాయి, కాపరాయి అనే రెండు రాళ్ల సముద్ర తీరం వైపు వచ్చే ఆటుపోట్ల తీవ్రతను తగ్గిస్తుంటాయి. మత్స్యకారులకు సైతం ఈ తీరం అత్యంత అనుకూలం.

15 వేల మంది మత్స్యకారులు...

పూడిమడక తీరంలో నాలుగు చిన్న పల్లెలు కలిసి ఉంటాయి. వాడ బలిజ, పల్లి, జాలారి శాఖలకు చెందిన వారు వేట సాగిస్తుంటారు. ఈ ప్రాంతం నుంచి ఎంతో మత్స్య సంపద జిల్లా కేంద్రాలకు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్తోందంటే అతిశయోక్తి కాదు. జాలారిపేట ఉన్న మెట్ట భాగం సైతం మత్స్యకారులకు మేలు చేసే విధంగా ఉన్న సహజ వనరు. ఇటువంటి సువిశాలమైన తీరం కలిగిన పూడిమడక గ్రామానికి శివారున ఉన్న మొగ సైతం పడవలు లంగరు వేసేందుకు, ఉప్పు పంట పండించేందుకు ఉపయోగపడే సహజ వనరు.

మమ్మల్ని కాపాడుతున్న దేవతలవి..

పూడిమడక గ్రామాన్ని కాపాడుతున్న దేవతలు ఆ రెండు రాళ్లు. ఏనుగు రాయి, కాపరాయిల వల్లే మాకు సముద్రపు పోటు తగ్గుతోంది. వేటకు వెళ్లే మత్స్యకారులకు ఈ రాళ్ల గతి, వేగం, లోతులను తెలియజేసే చుక్కానిలా నిలుస్తున్నాయి.

–మంగరాజు, మత్స్యకారుడు

వేడుకగా శారదాపీఠం వార్షికోత్సవాలు

- రాజశ్యామల యాగం, ఆంజనేయస్వామికి విశేష అభిషేకం
- పీఠాన్ని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమూర్తి, మంత్రి వేణుగోపాలకృష్ణ



మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు జ్ఞాపికను అందజేస్తున్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం : విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు మూడో రోజు ఆదివారం వేడుకగా జరిగాయి. వేద పారాయణలు, యజ్ఞ యాగాదులతో పీఠం ప్రాంగణం మార్మోగింది. పీఠంలో కొలువుదీరిన దాసాంజనేయస్వామికి ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి విశేషంగా అభిషేకం నిర్వహించారు. లోక కల్యాణార్థం రుద్ర హోమం, వన దుర్గా హోమాన్ని నిర్వహించారు. లక్ష మూల మంత్రాలతో చేపట్టిన రాజశ్యామల యాగం శాస్త్రోక్తంగా జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస చదుర్వేద హవనం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా జరిగిన చాత్తాడ శ్రీ వైష్ణవ ఆగమ సదస్సు ఘనంగా ముగిసింది. అర్చక అకాడమీ డైరెక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ సదస్సులను నిర్వహించారు. సదస్సుల్లో పాల్గొన్న విద్యార్థులకు స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశారు. సాయంత్రం స్వాత్మానందేంద్ర సరస్వతి చేతులమీదుగా శారదా స్వరూప రాజ శ్యామలా స్వరూప చంద్రమౌళీశ్వరులకు నిత్య పీఠార్చన విశేషంగా జరిగింది. కాకినాడకు చెందిన కృష్ణమూర్తి అండ్ బృందం వారిచే మోహినీ భస్మాసుర కూచిపూడి నృత్యం, అన్నమాచార్య సంకీర్తనల ఆలాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రాత్రి రాజశ్యామల అమ్మవారికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మంగళహారతిని సమర్పించారు. వారికోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి సచ్చిదానంద విద్వత్ సభ పేరిట శ్రౌత, శాస్త్ర సభలు జరగనున్నాయి.

పీఠాన్ని సందర్శించిన ప్రముఖులు

వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం పలువురు ప్రముఖులు శారదాపీఠాన్ని సందర్శించారు. రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పీఠంలో పూజలు నిర్వహించారు. పీఠాధిపతుల ఆశీస్సులు తీసుకున్నారు. శ్రీకాళహస్తి దేవస్థానం ఈవో సాగర్‌బాబు, ఆలయ పండితులు పీఠానికి వచ్చి రానున్న శివరాత్రి వేడుకలకు హాజరు కావాలని స్వామీజీలకు ఆహ్వానం పలికారు. వార్షికోత్సవాల్లో పాల్గొనేందుకు సోమవారం హర్యాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంగళవారం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ వస్తున్నట్టు పీఠం ప్రతినిధులు తెలిపారు.

నూతన వధూవరులకు సుబ్బారెడ్డి ఆశీర్వాదం



ఎంపీ సత్యవతి కుమారుడు దంపతులను ఆశీర్వదిస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి కుమారుడు డాక్టర్ యశ్వంత్, డాక్టర్ ప్రవంతి జంటను టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆశీర్వదించారు. ఆదివారం అనకాపల్లిలోని ఎంపీ నివాసంలో నూతన వధూవరులకు తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రసాదం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ఉన్నారు. సుబ్బారెడ్డి విశాఖలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుమారుడు ముళ్లపూడి శరత్ చౌదరి, జ్ఞానిత వివాహ రిసెప్షన్‌లో కూడా పాల్గొని నూతన జంటకు ఆశీస్సులు అందజేశారు.

కెమికల్ సేఫ్టీ సూపర్‌వైజర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: కెమికల్ సేఫ్టీ సూపర్‌వైజర్ సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. పాలిటెక్నిక్, బీటెక్ చేసిన విద్యార్థులతోపాటు పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఈ విభాగంలో అనుభవం ఉన్న వారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మూడు నెలల వ్యవధి కలిగిన ఈ కోర్సు పూర్తి చేసినవారికి రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ శాఖ (ఎస్‌బీటీఈటీ) సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. వివరాలకు కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు (9912340281), కోర్సు కోఆర్డినేటర్ ఎ.వరహాలు (79015 05682), ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ (9912342065) లను సంప్రదించవచ్చు. ఫిబ్రవరి 28వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అనితర సాధ్యుడు వేటూరి

- ఆయన కవితా శక్తికి ఆకాశమే హద్దు
- ఎలాంటి భావాన్నైనా పలికించగల దిట్ట
- వేటూరి పురస్కార గ్రహీత గోరటి వెంకన్న



గోరటి వెంకన్నను సన్మానిస్తున్న దృశ్యం

పాయకరావుపేట: వేటూరి కలానికి అన్ని వైపులా పదును ఉండేదని, ఎలాంటి భావాన్నైనా పలికించగలిగే శక్తి ఆయన సొంతమని ప్రముఖ కవి, గాయకుడు గోరటి వెంకన్న అన్నారు. వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆదివారం వెంకన్నకు ద్వాదశ వేటూరి కవితా పురస్కారం ప్రదానం చేశాయి. చిట్టూరి మెట్రోలో జరిగిన కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా ప్రఖ్యాత సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, అతిథులుగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, విశిష్ట అతిథిగా మధురకవి బులుసు వెంకటేశ్వర్లు, గౌరవ అతిథిగా డా.రెడ్డి భవానీరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న మాట్లాడుతూ.. వేటూరి పాటలలో నవరసాలు పొంగి పొర్లేవని, క్లిష్టమైన, తేలికైన పదాలతో గారడీ చేస్తూ ఆడుకోవడం ఆయన మాత్రమే చేయగలరని అన్నారు. వేటూరి పురస్కారానికి తనను ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నారని, నేటి యువతకు గాయకులుగా, గేయ రచయితలుగా చాలా అవకాశాలు ఉన్నాయని, మాతృభాషపై పూర్తి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని చెప్పారు. జానపద గేయాలు పాడి అలరించారు. గోరటి వెంకన్నను తుని, పాయకరావుపేటకు చెందిన పలువురు ప్రముఖులు 150 పుస్తకాలతో ఘనంగా సత్కరించారు. సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ మాట్లాడుతూ వేటూరి వంటి మహానుభావుని జయంతి వేడుకలు ఇంత ఘనంగా జరగడం తెలుగు సాహిత్యానికి ఇస్తున్న గౌరవమని అన్నారు. శంకరాభరణం, సప్తపది తదితర చిత్రాలలో ఆయన పాటలకు కీబోర్డ్ ప్లేయర్‌గా పని చేసే అదృష్టం తనకు కలిగిందని చెప్పారు.

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ వేటూరి సముద్రం వంటివారని, ఆయన నుండి సినీ అభిమానులు పాటలను తోడుకొనేవారని, సముద్రంలో నీరు ఇంకిపోనట్టుగా ఆయన హృదయంలో భావాలు, పాటలు ఎప్పుడూ ప్రవహిస్తూ ఉండేవని అన్నారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి, వేటూరి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ వేటూరి సాహితీ పీఠం ద్వారా ప్రతీ ఏటా కవితా పురస్కారాలు ప్రదానం చేయడం వేటూరికి ఇచ్చే గొప్ప నివాళిగా భావిస్తున్నామని చెప్పారు. వేటూరి తన పాటల రూపంలో ఇప్పటికీ మన మధ్య బతికే ఉన్నారని ఆయన అన్నారు. అనంతరం వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగ రామజోగేశ్వర శర్మ రచించిన కదంబం కవితా సంపుటిని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి, వేటూరి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ ఆవిష్కరించి ఆయనకు సింహతలాటాన్ని బహూకరించారు.

రసవత్తరం.. హాకీ సమరం

- రెండోరోజు 11 మ్యాచ్‌ల్లో పాల్గొన్న 22 జట్లు
- ఆద్యంతం ఉల్లాసంగా టోర్నమెంట్
- సెమీఫైనల్స్‌కు చేరిన అనకాపల్లి, విశాఖ, కాకినాడ, అనంతపురం జట్లు



సెమీఫైనల్‌కు చేరుకున్న క్రీడాజట్లతో నిర్వాహకులు



తలపడుతున్న క్రీడాకారిణులు



రాజీవ్ క్రీడా మైదానంలో ఉత్సాహంగా జరుగుతున్న హాకీ పోటీలు

యలమంచిలి: రాష్ట్రస్థాయి ఉమెన్స్ హాకీ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో రెండవ రోజు ఆదివారం జరిగిన 11 మ్యాచ్‌ల్లో 22 జట్లు పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్కంఠ భరితంగా ఈ పోటీలు జరిగాయి. పందిరి శివ,వియ్యపు రవి,మరి కొందరు సీనియర్ హాకీ క్రీడాకారులు అంపైర్లుగా, డైరెక్టర్‌గా కాకినాడ జిల్లాకు చెందిన రవిరాజు వ్యవహరించారు.జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ ఆడారి వీరునాయుడు,అధ్యక్షుడు జి.వి.రెడ్డి,దాసరి మహేష్,జి.సాయిరాం, బొద్దపు సత్యనారాయణ పోటీలను పర్యవేక్షించారు. గత రెండు రోజులుగా జరిగిన మ్యాచ్‌ల్లో సాధించిన పాయింట్ల ఆధారంగా అనకాపల్లి, విశాఖ, కాకినాడ, అనంతపురం జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నట్టు జిల్లా హాకీ అసోసియేషన్ కో ఆర్డినేటర్ కొఠారు నరేష్ ఆదివారం సాయంత్రం మీడియాకు తెలిపారు.లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఈ పోటీలు సోమవారంతో ముగుస్తాయి

సమష్టిగా రాణించిన విజేతలు

రెండో రోజు 22 జట్లు 11 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. ఆద్యంతం రసవత్తరంగా జరిగిన ఈ పోటీల్లో క్రీడాకారులు సమష్టిగా రాణించిన జట్లు విజయానికి కృషి చేశారు. రెండో రోజు మొదటి మ్యాచ్‌లో కాకినాడ-కర్నూలు జట్లు తలపడగా 5–0 గోల్స్ తేడాతో కాకినాడ అలవోక విజయం సాధించింది. విశాఖపట్నం-తిరుపతి జట్ల మధ్య మ్యాచ్ మొదటి సెషన్స్ పోటాపోటీగా సాగింది. చివరకు 4–2 గోల్స్ తేడాతో విశాఖజట్టు పైచేయి సాధించింది. కడప జట్టుపై అనకాపల్లి 3–0 గోల్స్ తేడాతో గెలుపొందగా, సత్యసాయి జిల్లా జట్టుపై కాకినాడ 3–0 తేడాతో, నెల్లూరుపై బాపట్ల జట్టు 5–0 తేడాతో, శ్రీకాళహస్తిపై అనంతపురం జట్టు 3–0 తేడాతో, గుంటూరుపై తిరుపతి 8–0 గోల్స్ తేడాతో, పశ్చిమ గోదావరి జిల్లాపై కడప జట్టు 3–1 తేడాతో, కర్నూలుపై సత్యసాయి జట్టు 3–0 తేడాతోనూ,గుంటూరుపై ప్రకాశం జట్టు 1–0 తేడాతో,కర్నూలుపై ఎన్‌టీఆర్ జట్టు 1–0 తేడాతో గెలుపొందాయి.

నేడు ఫైనల్స్

అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం, అనంతపురం జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం ఉదయం తొలి సెషన్స్‌లో సెమీ ఫైనల్‌మ్యాచ్‌లు నిర్వహించిన అనంతరం ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే కన్నబాబురాజు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు పేర్కొన్నారు.

గిరిజన యువత సంఘటితమే లక్ష్యం

- నెహ్రూ యువ కేంద్రం తెలుగు రాష్ట్రాల డైరెక్టర్ విజయరావు
- 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

కొమ్మాది(భీమిలి): దేశం నలుమూలల ఉన్న గిరిజన యువతను సంఘటితం చేస్తూ వారిలో ప్రతిభను వెలికి తీసేందుకు ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం దోహదపడుతుందని నెహ్రూ యువ కేంద్రం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ ఏఆర్ విజయరావు తెలిపారు. గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో ఆదివారం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం నిర్వహిస్తున్న ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజన యువతీ, యువకులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజయరావు మాట్లాడుతూ గిరిజన యువతకు కంప్యూటర్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చి, ఉన్నత స్థానంలో నిలబెట్టాలన్నారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. వీరికి వారం రోజుల పాటు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు కూడా ఉంటాయి. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఆశకుమారి, ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, జీవీపీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రజిని, తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ప్లాట్లకు ఈ వేలం

దొండపర్తి (విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ఖాళీ ప్లాట్ల విక్రయానికి ఫిబ్రవరి 9వ తేదీన ఈ–వేలం నిర్వహిస్తున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కూర్మన్నపాలెం ఫేజ్–1, 2, 6, భీమిలి మండలంలో కుమ్మరిపాలెం లేఅవుట్, చిలుకూరి జాయింట్ వెంచర్, డాక్టర్ పద్మావతి జాయింట్ వెంచర్, విజయనగరంలో కనపాక అయ్యన్నపేట హౌసింగ్ కాలనీ ఫేజ్–2 లేఅవుట్లలో నివాస అవసరాలకు అనువైన ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీకి సంబంధించి 28 ప్లాట్లను విక్రయించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్లాట్లకు సంబంధించిన వివరాలను www.vmrda.gov.inలో పొందుపరిచినట్లు వివరించారు. ఆసక్తి గల కొనుగోలుదారులు ఫిబ్రవరి 7వ తేదీ లోగా ఈ–పోర్టల్ https://konugolu. ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయినికి సన్మానం


నాగజ్యోతిని సన్మానిస్తున్న నింజాస్ అకాడమీ సభ్యులు

రావికమతం: డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ స్పోర్ట్స్, జీఎన్‌సిటీ ఆఫ్ ఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన 2022–23 ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంటు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కన్నంపేట స్కూల్ హెచ్ఎం నాగజ్యోతి పదో స్థానంలో నిలిచింది. ఆమె రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. ఈ సందర్భంగా నర్సీపట్నం నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగ నారాయణరావు, డైరెక్టర్ జగదీశ్వరరావు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఒక పక్క విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూనే, ఎన్నో పోటీల్లో రాణిస్తున్న నాగజ్యోతిని ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.

అమరావతి జేఏసీ జిల్లా నూతన కార్యవర్గం



అనకాపల్లి టౌన్: అమరావతి జేఏసీ అనకాపల్లి జిల్లా చైర్మన్‌గా డిప్యూటీ తహసీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు (వాసు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విశాఖలో జిల్లా కార్యవర్గాన్ని ఉద్యోగ సంఘ నేతలు ఎన్నుకున్నారు. కలెక్టరేట్‌లో డీటీగా పనిచేస్తున్న ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడును చైర్మన్‌గాను, ప్రధాన కార్యదర్శిగా ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డొక్కా లోవరాజు (నర్సీపట్నం), కోశాధికారిగా అనకాపల్లి ఉప తహసీల్దార్ వై.శ్రీరామ్మూర్తి, అసోసియేషన్ చైర్మన్‌గా డి.ఎ.వి.రామారావు (యలమంచిలి), కో చైర్మన్లుగా ఎల్. దిలీప్‌కుమార్ (సబ్బవరం), పి.దుర్గా శంకరరావు(ఎస్.రాయవరం), మైలపల్లి నాగసూరి శివ(అనకాపల్లి), చిటికెల జయమ్మ(కోటవురట్ల), కార్యదర్శులుగా కామిరెడ్డి దేవుడు(సబ్బవరం), చింతాడ శ్రీనివాసరావు(అనకాపల్లి), బొడ్డు రమేష్(అనకాపల్లి), కె.మాధవీలత(పరవాడ) ఎన్నికయ్యారు. రాష్ట్రంలో 94 సంఘాలతో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు చైర్మన్‌గా అమరావతి జేఏసీ ఏర్పాటైందని జేఏసీ ప్రతినిధులు తెలిపారు.

గ్రామీణులకు ఆధునిక వైద్యసేవలు

- కార్పొరేట్‌కు దీటుగా సీహెచ్‌సీల అభివృద్ధి
- మెరుగైన వసతులతోపాటు వైద్య పరీక్షలు
- పెరుగుతున్న ప్రసవాల సంఖ్య


చోడవరం సామాజిక ఆస్పత్రి


కార్పొరేట్ ఆస్పత్రిని తలపించే ఆస్పత్రి


శిశువుల ఇంక్యుబేషన్ రూమ్

చోడవరం రూరల్: సామాజిక ఆస్పత్రుల్లో గ్రామీణులకు ఆధునిక వైద్య సేవలందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో వాటి అభివృద్ధి, సామాజిక సౌకర్యాల కల్పన పట్ల చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ సత్ఫలితాలిస్తోంది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అనకాపల్లి జిల్లాలోని ఏడు ప్రధాన మండల కేంద్రాల్లో నిత్యం ఉత్తమ వైద్య సేవలందిస్తూ ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తోంది.

అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రి జిల్లా కేంద్ర ఆస్పత్రిగా రూపుదిద్దుకుంటుండగా, చోడవరం, మాడుగుల, కె.కోటపాడు, యలమంచిలి, కోటవురట్ల సామాజిక ఆస్పత్రులు ఆయా పరిసర గ్రామాలకే గాకుండా పరిసర మండల ప్రజలకు వైద్య సేవలందించడంలో ఉత్తమ ఫలితాలను అందుకుంటున్నాయి. ఈ ఆస్పత్రుల్లో రోజూ రెండు నుంచి మూడు వందల మంది ఔట్ పేషెంట్లు వైద్యం పొందుతున్నారు. గతంలో మాదిరిగా గాకుండా ప్రసవాలు సైతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరుగుతుండడాన్ని బట్టి చూస్తే సాధారణ రోగులకు ప్రభుత్వ వైద్య సేవల పట్ల నమ్మకం పెరిగిందన్నది ఇట్టే అర్థమవుతోంది. ఆయా ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో సిబ్బంది కొరత తీరి రోగులకు తక్షణ సేవలు అందడానికి వీలు కల్పించినట్టయ్యింది. ఆస్పత్రుల్లో వివిధ రకాల పరీక్షలు జరిపించడానికి తగిన వసతులు కల్పించారు. దాంతో చాలా వరకు పరీక్షలు సైతం ఆస్పత్రిలోనే అందడం సామాన్యులకు ఊరటనిస్తుందనడంలో సందేహం లేదు. గర్భిణుల విషయంలో దాదాపు అన్ని రకాల పరీక్షలకు ఆస్పత్రిలోనే ఆస్కారం కల్పించారు. ఆరోగ్యశ్రీ సేవలకు ఆస్కారం కల్పించడంతో చిన్నపాటి వైద్యసేవల కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పని లేకుండా సమీపంలో సామాజిక ఆస్పత్రిలోనే సేవల పొందుతూ శ్రమను తగ్గించుకుని సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. ఇక్కడ ప్రసవాలకు, ఇతర గైనకాలజిక్ వైద్య సేవలకు, చిన్న పిల్లల ఆరోగ్య సంబంధ వైద్య సేవలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలు అందుతున్నాయి. అనస్థీసియా కూడా ఉండడంతో సర్జరీలు సైతం వీలవుతున్నాయి.

చోడవరం సీహెచ్‌సీ ఉత్తమం

అనకాపల్లి జిల్లాలోని ఆరు సామాజిక వైద్యాలయాల్లో చోడవరం అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఆస్పత్రిలో ఒక్క జనరల్ సర్జన్ పోస్టు మినహా అన్ని పోస్టులు భర్తీ అయ్యాయి. ఇటీవల మల్టీపర్పస్ టెస్ట్ ఎక్విప్‌మెంట్ సమకూర్చారు. ఇది వినియోగంలోకి వచ్చినట్టయితే సామాన్యులకు చాల వరకు మేలు చేకూరుతుందని చెప్పవచ్చు. ఆస్పత్రిని అన్ని విధాలా మెరుగైన స్థానంలో నిలపడం కోసం ఆస్పత్రి అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఎక్స్‌రే ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్లాంట్ పట్ల శ్రద్ధ చూపి, ఎముకల వైద్య నిపుణుడిని నియమించినట్టయితే చోడవరం పరిసర గ్రామాల వారికి మరిన్ని వైద్య సేవలు పొందే వీలుంటుంది.

సిబ్బందితో సంసిద్ధం...



మా ఆస్పత్రిలో అన్ని పోస్టులు భర్తీ అయ్యాయి. ఒక్క జీఎస్ పోస్టు ఖాళీ ఉంది. మా సిబ్బందితో నిత్యం వైద్య సేవలకు సంసిద్ధంగా ఉన్నాం. ఆస్పత్రిలో ప్రస్తుతం ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్ సేవలు మాత్రమే అందుబాటులో లేవు. ఎమర్జెన్సీ కేసులను సత్వరం చికిత్స అందించి, అవసరాన్ని బట్టి పై ఆస్పత్రులకు సిఫారసు చేస్తున్నాం. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే గాకుండా కిటికీలకు నెట్టింగ్ వేయించడానికి చర్యలు తీసుకుంటున్నాం. నెల వారీ 30 నుంచి 50 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. రోజువారీ 300 పైబడి ఔట్ పేషెంట్ నమోదవుతోంది. ఎప్పటికప్పుడు సిబ్బందితో సమావేశాలు నిర్వహించి సేవలను మెరుగుపరచడానికి సూచనలివ్వడమే గాకుండా స్వీకరిస్తున్నాం. మెరుగైన స్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– డాక్టర్ ఎల్.వినయ్‌కుమార్, చీఫ్ సర్జన్, చిల్డ్రన్ స్పెషలిస్ట్, సామాజిక ఆస్పత్రి, చోడవరం

బాడీ బిల్డర్ మారునాయుడు యువతకు ఆదర్శం

- సన్మానించిన డిప్యూటీ సీఎం బూడి, యాదవ సంఘం నేతలు


మారునాయుడును దుశ్శాలువాతో సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి, తదితరులు

చీడికాడ: బాడీ బిల్డర్ నమ్మి మారునాయుడును ప్రతి యువకుడు ఆదర్శంగా తీసుకోవాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని అడవి అగ్రహారానికి చెందిన మారునాయుడుకు ఏషియన్ బాడీ బిల్డింగ్ (ఆర్మీ) 77 కేజీల విభాగంలో మొదటి స్థానం లభించింది. ఈ మేరకు సామాజిక కార్యకర్త గోకాడ ఝాన్సీ ఆధ్వర్యంలో ఆదివారం అడవి అగ్రహారంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బూడి ఆయనకు దుశ్శాలువా కప్పి అభినందించారు. బూడి వెళ్లిన అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు సభలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మాట్లాడారు. వీరి వ్యాఖ్యలను డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఖండించారు. ఇది రాజకీయ వేదిక కాదని, సన్మాన సభని ఘాటుగా స్పందించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో విశాఖ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, టి.డి.పి నేత పైలా ప్రసాదరావు, పారిశ్రామిక వేత్త బోడే రామచంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎన్నికల అధికారి

మహారాణిపేట : పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా డి.సీతారామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు ఎన్నికల అధికారి పి.అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ తనను మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, సీఈవో శ్రీరామ్మూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎన్నికైన అధ్యక్షుడిని రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్ అభినందించారు. ఎన్నికల పరిశీలకుడిగా విజయనగరం జిల్లా అధ్యక్షుడు మురళీ, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, విజయనగరం జిల్లా ఎన్‌జీవో అధ్యక్షుడు సురేష్, సహాయ ఎన్నికల అధికారిగా యు. కూర్మారావు వ్యవహరించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా బీహెచ్‌వీ రమణబాబు, ఉపాధ్యక్షుడిగా ఆర్‌వీ నాగరాజు, యుఎస్‌వీ శ్రీనివాసరావు, ఎల్.పూర్ణయ్య, సంయుక్త కార్యదర్శులుగా కె.సత్యనారాయణ మూర్తి, కె.ఆనందకుమార్, వై.రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డీవీఎస్ గౌరీపతిరావు, వి.రాధ, డి.కొండలరావు, జేసీసీ మెంబర్‌గా సీహెచ్ ఫ్లోరెన్స్ నైటింగేల్, స్టేట్ కౌన్సిలర్లుగా జి.గంగాధర్, ఎ.సత్యనారాయణ, సీహెచ్ సింహాచలం, జీఎల్ నరసింహం, కోశాధికారిగా ఎస్.త్రినాథ్ తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను, సీఈవోను మర్యాదపూర్వకంగా కలిసింది.

ఒకటో తేదీన 'మహా' కౌన్సిల్

- 15 సాధారణ, 89 అనుబంధ అంశాలతో అజెండా



దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం వచ్చే నెల ఒకటో తేదీన జరగనుంది. బుధవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కొత్త సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశంలో 15 సాధారణ, 89 అనుబంధ (సప్లిమెంటరీ) అంశాలపై చర్చించనున్నారు. చర్చించే అంశాల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

- జోన్–1 పరిధి 8వ వార్డు తారకరామ లేఅవుట్‌లో కమల్ టవర్ నుంచి ఈపీ నంబరు 257/ఏ/5 వరకు బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు రూ.98 లక్షలతో అంచనాను రూపొందించారు.
- 12వ వార్డు హెల్త్ సిటీ లేఅవుట్‌లో ఎంఎస్ఎఫ్–1కి ఎదురుగా ఉన్న రీ–క్రియేషనల్ ఏరియా వద్ద రూ.54.69 లక్షలతో ఎంఎస్ చైన్ లింక్ మెస్‌తో ఫెన్సింగ్ ఏర్పాటుకు, వాకింగ్ ట్రాక్, సిట్టింగ్ బెంచీలతో ఓపెన్ సైట్ అభివృద్ధికి పరిపాలన అనుమతి కోసం చర్చకు రానుంది.
- టౌన్ ప్లానింగ్ ఎస్టేట్ వింగ్ ఎండాడ గ్రామం సర్వే నంబరు 179/1పీలోని కొంత భాగంలో 0.50 ఎకరాలు ఏపీ స్టేట్ యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బదలాయింపునకు సంబంధించి చర్చ జరగనుంది.
- పెదగంట్యాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నైపుణ్య విద్యా సంస్థ ఏర్పాటుకు భూ బదలాయింపునకు సంబంధించి చర్చించనున్నారు.
- భూముల రీసర్వే ప్రాజెక్టు, జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కోసం కార్పొరేషన్ ఫండ్ నుంచి డీడీవో అకౌంట్ ఆఫ్ సీ అండ్ డీఎంఏకు రూ.270.25 లక్షలు బదిలీ చేసే విషయం చర్చకు రానుంది.
- అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న నలుగురు హార్టికల్చరిస్టుల వేతనాలు రూ.27 వేల నుంచి రూ.42,011 పెంచేందుకు చర్చించనున్నారు.

సప్లిమెంటరీ అంశాలు

- సర్దార్ వల్లభాయ్ పటేల్(పూర్ణామార్కెట్) మార్కెట్‌ను పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో పునరాభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతికి పంపేందుకు చర్చించనున్నారు.
- 15వ ఆర్థిక సంఘం 2022–23 ఏడాదికి మిలియన్ ప్లస్ నగరాలు, ప్రతిపాదిత పనులపై మాట్లాడనున్నారు.
- ఒప్పంద పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు కొనుగోలు విషయమై 2022–23 ఏడాదికి అవసరమయ్యే రూ.1,24,98,309 అంచనా వ్యయాన్ని కమిషనర్ తీసుకున్న నిర్ణయంపై చర్చించనున్నారు.

కొద్దిరోజుల్లో పెళ్లనగా...

- నేలబావిలో యువకుడి అనుమానాస్పద మృతి
- వీరనారాయణంలో విషాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు


ఆడారి మురళీకృష్ణ (ఫైల్)


బావిలో నుంచి తీసిన మురళీకృష్ణ మృతదేహం

మాడుగుల రూరల్ : వచ్చే నెల 9వ తేదీన వివాహం కాబోతుంది.. పెళ్లి ఏర్పాట్లు కూడా జోరుగా జరుగుతున్నాయి. ఇంతలో పెళ్లి కుమారుడు అనుమానస్పద రీతిలో బావిలో పడి మృతి చెందడం కలకలం రేపింది. పోలీసులు, వీరనారాయణం గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలివి. మండలంలో వీరనారాయణం గ్రామానికి చెందిన ఆడారి మురళీకృష్ణ (29) అండమాన్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ అక్కడే కుటుంబ సభ్యులతో ఉండేవాడు. గత ఏడాది అతను అండమాన్ నుంచి గ్రామానికి వచ్చి ఇక్కడే ఇల్లు నిర్మించుకున్నాడు. ప్రస్తుతం గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పనులు చేసుకుంటూ తన తల్లి పైడితల్లిమ్మతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మురళీకృష్ణకు ఇదే గ్రామానికి చెందిన యువతితో ఇటీవల వివాహం నిశ్చమైంది. వచ్చే నెల 9న వివాహం జరిపించాలని ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా మురళీకృష్ణ శనివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వీరనారాయణంలో ఇంటి వద్ద నుంచి తన బైక్ మీద బయటకు వెళ్లాడు. మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే చార్జింగ్ పెట్టి వదిలి వెళ్లాడు. కానీ రాత్రి 12 గంటలైనా ఇంటికి తిరిగి రాలేదు. అయితే ఎపి31బియు 6831 నంబరు గల మురళీకృష్ణకు చెందిన పల్సర్ బైక్, అతని చెప్పులు కె.జె.పురం జంక్షన్ నుంచి గ్రామానికి మధ్యలో గల కాళ్ల వారి నూతి సమీపంలో ఉన్నాయని కె.జె.పురం గ్రామస్తులు మురళీకృష్ణ కుటుంబ సభ్యులకు ఆదివారం ఉదయం సమాచారం అందించారు. బైక్ పర్సులో మురళీకృష్ణ, అతని తల్లి పైడితల్లమ్మ ఫొటోలు చూసి కొందరు వివిధ గ్రూపుల్లో ఫార్వర్డు చేశారు. దీంతో వీరనారాయణం గ్రామస్తులకు ఈ సమాచారం చేరడంతో వారు ఆదివారం ఉదయం 10 గంటలకు బావి వద్దకు వచ్చి చూశారు. విషయాన్ని వీఆర్వో కాళింగ రామునాయుడుతో పాటు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక పోలీసులు, మాడుగుల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి బావిలో గాలించి మృతదేహాన్ని బావి నుంచి వెలికి తీశారు. వీరనారాయణం గ్రామ పెద్దల సమక్షంలో శవపంచనామా నిర్వహించి ఎస్ఐ పి.దామోదరనాయుడు పర్యవేక్షణలో మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం అనకాపల్లి తరలించారు.

మృతునిది హత్యా, ఆత్మహత్యా ?

కాగా మృతుడు మురళీకృష్ణది హత్యా లేదా ఆత్మహత్య అనేది నిర్ధారణ చేయలేకపోతున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడి ముఖం, నుదిటి మీద, కంటి మీద గాయాలు ఉన్నట్టు గుర్తించారు. వివాదరహితుడుగా, మంచి వ్యక్తిగా గుర్తింపు ఉన్న మురళీకృష్ణ ఈ విధంగా విగత జీవుడుగా మారడం గ్రామస్తులను కలచివేసింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి అప్పారావు గతంలోనే మృతి చెందారు. ఇద్దరు అక్కలకు వివాహం అయింది. మృతుడి తల్లి పైడితల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కోళ్ల వ్యాన్... డ్రైవర్ మృతి


వ్యాన్‌లో చిక్కుకొని మృతి చెందిన డ్రైవర్ ప్రేమ్‌కుమార్

చోడవరం : వ్యాన్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి విశాఖపట్నం కోళ్ల లోడుతో వెళుతున్న వ్యాన్ చోడవరం మండలం అడ్డూరు సమీపంలో ఆదివారం ప్రమాదానికి గురైంది. వేగంగా వెళుతున్న వ్యాన్ ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. దీంతో వ్యాన్ నడుపుతున్న డ్రైవర్ కోన ప్రేమ్‌కుమార్ (30)కు తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునిది యలమంచిలి మండలం గొల్లలపాలెం. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. ప్రేమ్‌కుమార్ ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగారు. సమాచారం తెలుసుకున్న చోడవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకున్న ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అప్పలనాయుడు తెలిపారు.

పీవీ జీవితం యువతకు ఆదర్శం

మద్దిలపాలెం: ఉమ్మడి రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు పీవీ చలపతిరావు జీవితం యువతకు ఆదర్శమని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. పీవీ చలపతిరావు తనయుడు ఎమ్మెల్సీ మాధవ్ స్వగృహానికి ఆదివారం ఆయన వచ్చి.. పీవీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

గోపాలపట్నం: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం సాయంత్రం విశాఖ విమానాశ్రయంలో పలువురు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు.

ఎగుమతులను ప్రోత్సహించేలా బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రికి ఏపీ చాంబర్స్ లేఖ


పైడా కృష్ణప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచంలో నెలకొన్న అనిశ్చితి, ఆర్థిక మాంద్యం దృష్ట్యా రెండు రోజుల్లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో పరిశ్రమలకు ప్రోత్సాహకాలందిస్తూ.. ఎగుమతులపై దృష్టి సారించాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం జీఎస్టీ పెనాల్టీ రేట్లను 18–24 శాతం నుంచి 12 శాతానికి తగ్గించాలని కోరారు. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు ఎగుమతిదారులకు 50 శాతం ఆటోమేటిక్ బీమా కవర్ ప్రీమియంను కేంద్రం చెల్లించాలన్నారు. ఐటీ పరిమితుల్లోనూ మినహాయింపులివ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్‌ల చెల్లింపుల కోసం కంపెనీలు ఖర్చు చేసే మొత్తాన్ని కేంద్రం చెల్లించాలన్నారు. డిజిటల్ లావాదేవీలు, గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీలను ప్రోత్సహించాలని కోరారు. గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు పరికరాలను కొనుగోలు చేసే అన్ని యూనిట్లకు 30 శాతం మూల ధన రాయితీ, పన్ను రాయితీ కల్పించాలని కృష్ణప్రసాద్ ఆర్థిక మంత్రిని కోరారు. బ్యాంకు వడ్డీ రేట్లు, ప్రత్యక్ష, పరోక్ష పన్నులు భారీగా తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు.

అమ్మవారి హుండీలో నగదు చోరీ


దొంగలు పగులగొట్టిన హుండీ

కోటవురట్ల : రామచంద్రపురం శివారు నూకాలమ్మతల్లి ఆలయంలో హుండీలో నగదు చోరీకి గురైందని గ్రామ పెద్దలు చిన్న, పులి చంటి తెలిపారు. దొంగలు హుండీని పగులగొట్టి భక్తులు వేసిన కానుకలను అపహరించుకుపోయారని తెలిపారు. ఇలా తరచూ హుండీలో నగదు చోరీకి గురవుతోందని, ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరా ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు. కాగా ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ బాక్సింగ్ పోటీల విజేత నర్సీపట్నం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నింజాస్ అకాడమీ డైరెక్టర్లు నారాయణరావు, సుమ

నర్సీపట్నం: నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఇంటర్ డిస్ట్రిక్ బాక్సింగ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో రాజమండ్రి, తుని, గాజువాక, గొలుగొండ, నర్సీపట్నం పరిసర మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు సీనియర్ కోచ్ శేఖర్, రిఫరీ కోచ్ మౌనిక వ్యవహరించారు. ఈ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన క్రీడాకారులు ప్రథమ స్థానం, రాజమండ్రి క్రీడాకారులు ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్ సైకాలజిస్టు సుమ బహుమతులు అందజేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పీడీలు లక్ష్మి, అచ్చమ్మ, దేవిలను ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం



బాణసంచా విన్యాసాలు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం కన్నులపండువగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు పట్టణవాసులను ఆకట్టుకున్నాయి. మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలు జాతరలో ఆకర్షణగా నిలిచాయి.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లిటౌన్: ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో పట్టణంలో పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్‌కు సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రమణమూర్తి ఆదివారం తెలిపారు. కోట్నివీధి, తాకాశివీధి, కరణాలవీధి, పూడిమడక రోడ్డు, చిన్నవీధి, చేపలమార్కెట్, ఉడ్‌పేట, నెయ్యిల వీధి, చోడవరం బస్టాప్, నర్సింగరావుపేట, న్యూబర్మాకాలనీ, చవితినవీధి, రైల్వేస్టేషన్ రహదారి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్షకు 400 మంది హాజరు



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

కశింకోట: స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలులో ఆదివారం నిర్వహించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతనం (ఎన్‌ఎంఎంఎస్)నమూనా పరీక్షకు విశేష స్పందన లభించింది. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన పరీక్షకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 400 మంది 8వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ప్రతిభ చూపిన పది మంది విద్యార్థులకు పతకాలు, జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో చిట్టిబాబు మాట్లాడుతూ నమూనా పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల, అవగాహన, పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆచంట నాగేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు ఎ.వి.ఎస్.మూర్తి, కృష్ణ, తమ్మిరాజు, డి.నూకేష్, ఎస్.రమేష్, బోయిన చిన్నారావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నవజాతశిశు సంరక్షణ విభాగం ప్రారంభం

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ.92లక్షల వ్యయంతో నిర్మించి నవజాత శిశు సంరక్షణ విభాగాన్ని సోమవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించనున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు తెలిపారు. అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
సిందూరం	-సత్యనారాయణ స్క్రీన్-1
పఠాన్	-సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
పఠాన్	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
హంట్	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు , బి పాజిటివ్-11 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్ 10 యూనిట్లు, ఒ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 203 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 417 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

ఇటుకల బట్టీలు.. ఉపాధికి బాటలు



కాల్చడానికి బట్టీలో పేర్చుతున్న ఇటుకలు

- కశింకోట మండలంలో జోరుగా తయారీ
- ఉపాధి పొందుతున్న ఒడిశా కూలీలు
- సీజన్‌లో కోటి ఇటుకల తయారీ



అచ్చుల్లో పోసి ఇటుకలు తయారు చేస్తున్న ఒడిశా కూలీలు

కశింకోట: మండలంలో ఇటుకల తయారీ జోరుగా సాగుతోంది. ఇవి పలువురికి ఉపాధి కల్పిస్తున్నాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో కోటల్లా పెద్ద పెద్ద బట్టీలు ఏర్పాటు చేసి, తయారీ చేపట్టారు. ప్రధానంగా ఎక్కువ మంది ఒడిశా కూలీలు వీటిలో ఉపాధి పొందుతున్నారు. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం ఇక్కడ శారదానది అవతల పొలాల్లో ఇటుకల తయారీ ప్రారంభమైంది. నెల్లూరుకు చెందిన ఎక్కువ మంది వ్యాపారులు ఇక్కడకు వచ్చి తయారీ ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరాటంకంగా సాగుతోంది. మొదట్లో సుమారు 20 వరకు బట్టీలు మొదట్లో ఉండేవి. పెట్టుబడులు, మట్టి, మెటీరియల్, కూలీ ధరలు పెరిగిపోవడంతో ఇవి క్రమేపి తగ్గిపోయాయి. ప్రస్తుతం అరు బట్టీలు మాత్రమే ఉన్నాయి. ఈ బట్టీల్లో సీజన్‌లో సుమారు కోటి ఇటుకలు తయారు చేస్తారు. ఒడిశాకు చెందిన సుమారు 400 మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఇటుకల తయారీలో ఒడిశా కూలీలు దిట్టలు. దీంతో ఒడిశా కూలీలను ఇక్కడ బట్టీల నిర్వాహకులు ఏటా తీసుకువచ్చి తయారీ చేయిస్తుంటారు. సాధారణంగా ఇక్కడ ఇటుకల తయారీ డిసెంబర్ నెలలో మొదలై వర్షాకాలానికి ముందు జూన్‌లో ముగుస్తుంది. దీన్ని రైతుల పంట భూములను ఏటా లీజుకు తీసుకొని ఇటుక తయారీలో వినియోగించే మట్టి తీస్తారు. మట్టితో పాటు కొబ్బరి పొట్టు, బూడిద, ఊక కలిపి ముద్దగా తయారు చేసి అచ్చులు వేస్తారు.ఆ ఇటుకలను ఎండలో ఆరబెట్టి వాటిని ఒకచోట పెద్ద బట్టీగా పేర్చి బొగ్గు,కర్రలతో కాలుస్తారు. కాల్చిన ఇటుకలను అమ్మకానికి సిద్ధం చేస్తారు. ఇలా ఇటుక తయారీకి సుమారు నెల రోజుల వ్యవధి పడుతుంది.



ఎండలో ఆరబెట్టిన ఇటుకలు

తేలికపాటి ఇటుకల తయారీ

ఇక్కడ గతంలో సాధారణ బరువు, తేలిక (లైట్ వెయిట్) ఇటుకలు తయ్యారయ్యేవి. ఇప్పుడు తేలిక రకాన్ని మాత్రమే తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారు అయ్యే ఇటుక నాణ్యమైనదిగా భావించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళతారు. ఒక్కో ఇటుక నాణ్యతను అనుసరించి ప్రస్తుతం రూ.5.50 నుంచి రూ.6.50 వరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం జగనన్న ఇళ్ల కాలనీలు, ప్రైవేటు ఇళ్ల నిర్మాణం జోరుగా జరుగుతుండడంతో వీటికి ప్రస్తుతం డిమాండ్ ఉంది.

పెట్టుబడులు అధికం

వీటి తయారీ భారంగా మారిందని, పెట్టుబడులు అధికమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. రాస్తా బొగ్గు టన్ను గతంలో రూ.3వేలు ఉండేదని,ప్రస్తుతం రూ.8 వేలు, ఊక రూ.2 వేల నుంచి రూ.6500 కు పెరిగినట్టు చెప్పారు. భూముల ధరలు పెరిగిపోవడం వల్ల ఇటుకల తయారీకి ఇవ్వడానికి రైతులు ముందుకు రావడం లేదని, ప్రస్తుతం ఎకరాకు ఏడాదికి రూ. లక్ష చెల్లించి మట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. ఇలా అయితే మున్ముందు వీటిని నిర్వహించడం కష్టంగా పరిణమించనుందంటున్నారు.

తుది దశకు దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ పనులు



పనులను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆధునికీకరణ పనులు ఆఖరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ పనులను ఆదివారం ఆయన పర్యవేక్షించారు. ఇప్పటికే కాంప్లెక్స్ ఆవరణను సిమెంట్ కాంక్రీట్‌తో ప్లాట్‌ఫాం మాదిరిగా నిర్మించారు. కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికుల సౌకర్యార్థం సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి సైతం రూ. 6 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆయన ఆదేశించారు. తాజాగా సీఎంఆర్ షాపింగ్ మాల్స్ సంస్థల అధినేత మావూరి వెంకటరావు సహకారంతో ఆర్టీసీ కాంప్లెక్స్ భవనానికి మెరుగులు దిద్దుతున్నారు. ఈ పనుల పురోగతిని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు డిప్యూటీ సీఎంకు వివరించారు. పనులను వీలైనంతా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వాలేటి నాగరాజు పాల్గొన్నారు.

యువకుడిపై మహిళ దాడి

అనకాపల్లిటౌన్: మండలంలో కుంచంగి గ్రామానికి చెందిన భాస్కరరావు అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన ఓ మహిళ గడ్డికోసే కొడవలితో ఆదివారం దాడి చేసింది. రూరల్ ఎస్ఐ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పొలంలో ఇద్దరి మహిళలు ఘర్షణ పడుతుండగా భాస్కరరావు ఆపేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఒక మహిళ భాస్కరరావుపై దాడి చేసిందని ఎస్ఐ చెప్పారు. బాధితుడిని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బల్లాట నిర్వాహకుడి అరెస్టు

కశింకోట: మండలంలోని జెట్టపురెడ్డితుని గ్రామంలో బల్లాట నిర్వహిస్తుండగా దాడి చేసి నిర్వాహకుడు శివకోటి శివను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ. 1,170 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

శివాలయ ధ్వజస్తంభం ప్రతిష్ట పూజ ప్రారంభం



పూజలు చేస్తున్న జెడ్పీటీసీ విజయశ్రీకాంత్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సత్తిబాబు

చోడవరం: ప్రాచీన దేవాలయమైన స్థానిక స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునః ప్రతిష్ట పూజా కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 31వ తేదీన ధ్వజస్తంభం పునః ప్రతిష్ట చేయనుండటంతో ముందుగా యాగశాలకు అంకురార్పణ చేశారు. విఘ్నేశ్వర స్వామి పూజ, పుణ్యావాహచనం, పంచ గవ్యప్రాసన దీక్షవస్త్రధారణ, రక్షా బంధనం యాగశాల ప్రవేశానికి అంకురార్పణ పూజలతో ధ్వజస్తంభం ప్రతిష్ట పూజలు ప్రారంభించారు.

జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గూనూరు సత్తిబాబు ఈ పూజల్లో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు కొడమంచిలి వెంకట్రావు, చలపతిరావు ఆధ్వర్యంలో వేదపండితుల బృందం ఈ పూజ క్రతువు నిర్వహించింది.

12న విశాఖలో మత్స్యకార సేవా సంఘ సమావేశం

రాంబిల్లి : వచ్చే నెల 12న విశాఖలో నిర్వహించే మత్స్యకార సేవా సంఘ సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు కోరారు. ఆదివారం వాడ నర్సాపురంలో సర్పంచ్ కారె రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం ఈ సర్వసభ్య సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, మత్స్యకార నాయకులు సూరాడ నూకరాజు, ఎరిపల్లి మొగ్గరాజు పాల్గొన్నారు.

వృథాగా ఏలేరు నీరు!

లాక్ సిస్టమ్ దెబ్బ తినడంతో దుస్థితి



కాలువకు 59వ కిలో మీటరు వద్ద ఏర్పాటు చేసిన పాయింట్



పైపులైను నీరు తరలించేందుకు ఏర్పాటు చేసిన లాక్‌సిస్టమ్



చినగొలుగొండపేట వద్ద వృథాగా పోతున్న ఏలేరు నీరు

నాతవరం: కళ్ల ముందే ఏలేరు కాలువ నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి విశాఖపట్నం కాలువ ద్వారా 154 కిలోమీటర్ల మేర పొడవున నీరు ప్రవహిస్తోంది. మార్గం మధ్యలో పలు చోట్ల లీకేజీ ద్వారా నీరు నిత్యం వృథాగా పోతోంది. తూర్పుగోదావరి జిల్లాలో పలు గ్రామాలకు వేసవిలో తాగునీరు అందించేందుకు ఏలేరు కాలువకు 59వ కిలోమీటరు చినగొలుగొండపేట వద్ద పాయింట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ్నుంచి పైపులైన్ ద్వారా తుని నియోజకవర్గానికి తాగునీటిని తరలిస్తుంటారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో ప్రస్తుతం పైపులైన్ నుంచి తాగునీరు తరలించలేదు. ఈ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన లాక్ సిస్టమ్ దెబ్బతినడంతో ఏలేరు నీరంతా వృథాగా పోతోంది. కొండ ధర్మవరం, గునుపూడి, లింగంపేట, మన్యపురట్ల ఎ.పి.పురం, ఎ.శరభవరం గ్రామాల వద్ద ఈ పరిస్థితి ఉంది. ఈ లీకేజీ ద్వారా వచ్చే నీరు చినగొలుగొండపేట డ్రైనేజీలో నిత్యం కలుస్తోంది. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏలేరు కాలువ ద్వారా నీటిని విశాఖపట్నం జీవీఎంసీ స్టీల్‌ప్లాంటుకు గంగవరం పోర్టుకు ఎన్టీపీసీ, ఏపీఐఐసీకి ఇతర అవసరాలకు తరలిస్తున్నారు. రాజుపేట అగ్రహారం వద్ద తాండవ నదిపై నిర్మించిన ఆక్వా డెక్టు పి.కె.గూడెం సమీపంలో ఏలేరు కాలువపై నిర్మించిన స్లూయిజ్ ద్వారా లీకేజీ ద్వారా నీరు వృథాగా పోతోంది. ఈ విషయంపై ఏలేరు కాలువ జేఈ నానాజీ మాట్లాడుతూ పలు చోట్ల శిథిలమైన ఏలేరు కాలువ మరమ్మతులు చేసేందుకు నిధులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు వచ్చాక పనులు చేస్తామన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్, వెంకటరావు

కె.కోటపాడు: మేడిచర్లలో అభయాంజనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, కుంకుమ పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు, అభివృద్ధి కమిటీ చైర్మన్ కిల్లి జగన్నాథం, బొడ్డు వేణు పాల్గొన్నారు.

చిల్డ్రన్ క్లబ్‌తో పఠనాసక్తి పెంపు



చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారిణి దమయంతి

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చిల్డ్రన్ క్లబ్ నిర్వహించారు. క్లబ్‌లో పిల్లలను సభ్యులుగా చేర్పించారు. గ్రంథాలయ అధికారి పి.దమయంతి మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే గ్రంథాలయంపై ఆసక్తి పెంచేందుకు కొన్నాళ్లుగా చిల్డ్రన్‌క్లబ్ నిర్వహిస్తున్నామన్నారు. రాను రాను వచ్చే పిల్లల సంఖ్య పెరుగుతుందన్నారు. పిల్లల్లో పోటీతత్వం పెచ్చుతున్నామన్నారు. వారిలో పఠనాసక్తి పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు విధిగా ప్రతి ఆదివారం చిల్డ్రన్ క్లబ్‌కు పంపించాలని కోరారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



బయ్యవరంలో రక్తదానం చేస్తున్న యువతి

కశింకోట: మండలంలోని బయ్యవరంలో స్వామీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 60 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ రోజారాణి మాట్లాడుతూ యువతి లక్ష్మి రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆమెను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అన్ని దానాల కంటే రక్తదానం మిన్న అని, ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువతీయువకులు ఏడాదికి కనీసం రెండుసార్లు రక్తదానం చేయవచ్చునన్నారు. వివేకానంద యూత్ సభ్యులు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, లంక దుర్గాప్రసాద్, గొన్నాబత్తుల నానాజీ, దేవర చిరంజీవి, జగతా భూపతి, పాతాళ శ్రీకాంత్, సనేడ గజ్జాలు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



పూర్వ విద్యార్థులు

అనకాపల్లి రూరల్: అనకాపల్లి మున్సిపల్ పాఠశాలలో 1984-85 సంవత్సరంలో టెన్త్ చదువుకున్న విద్యార్థుల 38 ఏళ్ల తరువాత ఆదివారం కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు సత్యనారాయణపురం కొండ వేదికగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు వృత్తి, వ్యాపార,ఉద్యోగాల్లో స్థిరపడినవారంతా ఈ సమావేశానికి తరలివచ్చారు. ఒకరినొకరు చాలా కాలం తరువాత చూసుకోవడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

ఆ నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.వి. రామకష్ణ, సీహెచ్ సుబ్బారావు, బి.దేవయ్య, అప్పికొండ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో ఆత్మ విశ్వాసం



నమూనా పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

మునగపాక : నమూనా పరీక్షల్లో పాల్గొనడం ద్వారా పోటీతత్వం అలవాటు అవుతుందని ప్రవాస భారతీయుడు బుద్ధ వెంకట శివ అన్నారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపేందుకు ఇటువంటి నమూనా పరీక్షలు దోహదపడతాయన్నారు. సంస్థ ప్రతినిధులు ఆడారి దక్షిణామూర్తి, ఎం.సత్యనారాయణ మూర్తి, శివకోటి దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చినపాచిలలో తాగునీటి సమస్య



మోటారు పాడవ్వడంతో పనిచేయని ప్రధాన పైపులైన్

రావికమతం: చినపాచిలలో మంచినీటి సమస్య నెలకొంది. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన మంచినీటి ట్యాంకుకు అమర్చిన మోటారు, ఎలక్ట్రికల్ బోర్డు పాడవ్వడంతో ఈ సమస్య తలెత్తింది. వెంటనే వీటిని బాగుచేయాలని కోరినా ఇప్పటికీ గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉప సర్పంచ్ కోమటి శంకర్రావు ఆదివారం ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

మాకవరపాలెం: కొండలఅగ్రహారంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ శనివారం తీర్థ మహోత్సవం నిర్వహించి ఆదివారం రాత్రి గౌరీపమేశ్వరులను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఉదయం నుంచి భక్తులు గౌరీపరమేశ్వరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలైన దాలింపేట, మాకవరపాలెం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి తీర్థ మహోత్సవాన్ని తిలకించారు. సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ, మాజీ సర్పంచ్ చిటికెల రమణ, గ్రామ పెద్ద రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత రైతు కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత రైతు కుటుంబాన్ని ఓదార్చుతున్న జెడ్పీటీసీ అనురాధ

కె.కోటపాడు: సింగన్నదొరపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో పశువుల పాకతోపాటు గేదె, గడ్డి, ధాన్యం కోల్పోయిన రొంగలి అక్కునాయుడు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలవనున్నట్లు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తెలిపారు. ఆదివారం ఆమె బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచన మేరకు రూ.5 వేలు అందించారు. పశువులను మరలా పెంచుకుంటే కావాల్సిన గడ్డిని సమకూర్చనున్నట్లు భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రొంగలి వెంకటరమణ, లాలం నాని, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, మాజీ ఎంపీపీ నారపాటి సత్యవతి, శ్రీరామ్మూర్తి, కర్రి నాయుడు పాల్గొన్నారు.